ప్రజాశక్తి
శనివారం 6 డిసెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

ఆర్చరీ క్రీడాకారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ శుక్రవారం తన ఛాంబర్ లో అంతర్రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్న క్రీడాకారులకు ఈ సాయం అందించడం ద్వారా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి కలెక్టర్ చొరవ చూపారు. ఈ అంతర్రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలు ఈ నెల 11, 12 తేదీలలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో నిర్వహించనున్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి, జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందుకున్న క్రీడాకారులను జిల్లా కలెక్టర్ తో పాటు, డిఎస్డిఓ, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్థిక సహాయం చేస్తున్న కలెక్టర్


తాళాలు వేసిన మరుగుదొడ్డి

చిందరవందరగా ఉన్న పైపులు

మూతబడిన మరుగుదొడ్లు

- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక మూలకు..
- వ్యాపారులు, కొనుగోలుదారుల అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ, అధికారులు
- ఇదీ గిరిజన మార్కెట్ మార్కెట్ యార్డు దుస్థితి

గిరిజన మార్కెట్ యార్డు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని గిరిజన మార్కెట్ యార్డులోని మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండటంతో స్థానిక దుకాణదారులు ఆవేదన చెందుతున్నారు. రన్నింగ్ వాటర్ లేకపోవడం, మరుగుదొడ్ల పైపులు విరిగిపోయి, అపరిశుభ్ర వాతావరణంతో పనికిరాని స్థితికి చేరిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు రోజూ ఆశీల వసూలులో ఉన్న శ్రద్ధ, వీటి మరమ్మతుల విషయంలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. రోజూ మార్కెట్కు వచ్చి వెళ్లే వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో కనీస సౌకర్యాలు కల్పించక పోవడం బాధాకరమని దుకాణదారులు, కొనుగోలు దారులు వాపోతున్నారు.. తక్షణమే చర్యలు తీసుకుని మార్కెట్లో మరుగుదొడ్లను వినియోగం లోకి తెచ్చి చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను కోరారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరావు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు

-ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విఆర్ఎలకు పే స్కేల్ జీతాలు చెల్లించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటిడిఎ గేటు వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో విఆర్ఎలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా విఆర్ఎలతో చేయిస్తున్నారని, నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న విఆర్ఒ, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెరిగిన ధరలతో కుటుంబాలు సతమతం అవుతున్నారన్నారు. అంతకుముందు విఆర్ఎల సంఘం నాయకులు శేఖర్, కొండబాబు, త్రినాధ్, మహేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ దినేష్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అప్పారావు, పెద్ద ఎత్తున విఆర్ఎలు పాల్గొన్నారు.

వరి పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- నక్కపల్లి: మట్టి నమూనాల విశ్లేషణ ఆధారంగా సమతుల్యమైన ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసీమణి రైతులకు సూచించారు. మండలంలో దోసలపాడు, గుల్లిపాడు, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా పర్యటించారు. వరి పంట పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటలకు సిఫార్సు చేసిన ఎరువులను మాత్రమే వాడాలని సూచించారు.ఆరోగ్యకరమైన నేల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంచార్జి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ ఆహార భద్రత, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలు వంటి వాటి గురించి వివరించారు. రైతులకు సూక్ష్మ పోషకాలు, జింక్ సల్ఫేట్ అవశ్యకతను వివరించారు.

సీలేరులో దట్టంగా కురుస్తున్న మంచు

దట్టంగా కురుస్తున్న మంచు

- పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో వారం రోజుల నుంచి చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి చల్లటి గాలులు వీస్తూ సాయంత్రం 6 గంటలకు చలి అధికమవుతోంది. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 7 గంటల వరకు సీలేరు పరిసర ప్రాంతాల్లో అధికంగా మంచు కురుస్తూ అతి శీతలంగా మారుతుంది. దీంతో వృద్ధులు, చిన్నారులు, వ్యాధిగ్రస్తులు చలి తీవ్రతకు తట్టుకోలేక సతమతమవుతున్నారు. పాఠశాలకు వెళ్లేటప్పుడు విద్యార్థులు వణుకుతున్నారు. సీలేరు నదిపరివాహ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు చలితీవ్రత అధికంగా ఉండడంతో రాత్రి సమయంలో ఇంటి సమీపంలో చలి మంటలు వేసుకుంటున్నారు. చలి కారణంగా దినసరి కూలీలు ఇంటి నుంచి బయటకు రావడానికి సాహసించడం లేదు. పొలం పనులకు ఆలస్యంగా వెళుతున్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కూనవరం

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని లింగాపురం గ్రామంలో సీపీఎం శాఖ సమావేశం సోడె రాఘవయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యాపార వేత్తలకు లాభాలు వచ్చే విధంగా చట్టాలు చేస్తున్నాయని విమర్శించారు. వరి పంటతో పాటు మిగతా పంటలు మిర్చి, అపరాలు వంటి పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వరదలు వల్ల ముంపు గురైన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, లింగాపురం గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ప్రాజెక్టు ముంపుకు గురవుతున్న భూములకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి సోడె రత్తయ్య, సోడె రత్నబాబు, సవలం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ దినేష్ కుమార్- పిజిఆర్ఎస్ కు 95 అర్జీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 95 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ కె సాహిత్, ఇంచార్జ్ ఆర్ డిఒ ఎస్ విఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు వచ్చిన సమస్యలు పరిష్కారం వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యు డిడి పిబికె పరిమళ, భూగర్భ జల వనరుల శాఖ డిడి డి.శ్రీనివాసరావు, డిఆర్ డిఎ పిడి వి.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బిఎస్ నంద్, జిల్లా ఖజానా లెక్కల శాఖ అధికారి ఆర్ ప్రసాద్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్మోహనరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్ వి.రమణరావు, జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి దేవేంద్రుడు,ఆర్అండ్ బి ఇఇ బాలసుందర బాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్రశేఖర్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి ఝాన్సీరామ్ పడాల్, జిల్లా ప్రణాళిక అధికారి పి.ప్రసాద్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్, ఐటిడిఎ ఎఒ హేమలత పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రైతుకు దాణా బస్తాను పంపిణీ చేస్తున్న పిఒ

సేంద్రియ సాగును అవలంభించాలి

- ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ

ప్రజాశక్తి-పాడేరు: సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించటానికి దోహదం చేసే వర్క్ షాపులను వినియోగించు కోవాలని ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ అన్నారు. శుక్రవారం పురుగుమందుల సూత్రీకరణ సాంకేతిక సంస్థ, హర్యానా సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమైక్య (గుంటూరు) ఆధ్వర్యంలో పాడేరు కేంద్రంగా వర్క్ షాప్ను ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రైతులకు పంటలు నాశనం చేసే క్రిమి కీటకాలు నిరోధించుటకు ఎటువంటి మందులు వినియోగించాలో ఈ వర్క్ షాప్ ద్వారా తెలుసు కోవచ్చాన్నారు. పర్యావరణ హితమైన ఔషధాలు స్థానికంగా లభించే మూడు పదార్థాలతో తయారు చేయు పద్ధతులను నేర్చుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చాన్నారు. సేంద్రియ ఎరువులు, క్రిమి కీటకాలను నిరోదించే పద్ధతులపై ప్రాముఖ్యతను వివరించారు.

పాడేరు మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, పూర్వ పెద్దల ఆహారం అలవాట్లను వివరిస్తూ నేటి తరం పాటిస్తున్న ఆహారపు అలవాట్లు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ జిడిసి ఎఫ్ ఎల్ ఎండి డాక్టర్ అమరేంద్ర కుమార్, ఎఎస్ఆర్ జిల్లా డిఎహెచ్ఓ జయరాజు, గొర్రెలు సహకార సంఘాల చైర్మన్లు గంట శ్రీరామ్, ఏడీ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వేణు మాదవ్, డాక్టర్ కిషోర్, వంట్లమామిడి డాక్టర్ రాజీవ్ కిషోర్, డోకుదారు పశువైద్య సహాయక అధికారి కె.సురేష్, ఏకలవ్య ఫౌండేషన్ సీఈవో మధుకర్, వాసన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరం 11 మండలాల పరిధిలో ఉన్న ఆశవర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కారం చెయ్యాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ డిమాండ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై అనేక మార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల వయోపరిమితి జీవో ఇచ్చినప్పటికి 60 ఏళ్ళకే వర్కర్ల జీతం ఆపేసి ఇంటికి పంపించేస్తుందని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా 8 నెలల పాటు రిటైర్మెంట్ పేరుతో వేతనాలు ఆపేసి ఇంటికి పంపించేశారని తెలిపారు. గతం నుంచి రెండు ఐటీడీఏల పరిధిలో అధికారులతో జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేసి ఆశవర్కర్ల సమస్యలు పరిష్కారం చెయ్యాలని కోరుతున్నప్పటికి ఆ దిశగా అధికారులు ఏమాత్రం చొరవ చూపటం లేదని విమర్శించారు. ప్రతి ఏటా రంపచోడవరం ఐటీడీఏ ద్వారా ఇచ్చే రికార్డ్స్ ఆశవర్కర్లకు వెంటనే ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ పేరుతో ఆపేసిన 8 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, వయోపరిమితి ఉన్న వర్కర్లను విధుల్లో కొనసాగించాలని, రెండు ఐటిడిఎల పరిధిలో జాయింట్ మీటింగ్స్ వెంటనే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపకపోతే ఈ నెల 20న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమంలో రంపచోడవరం 11 మండలాల్లో ఉన్నా ఆశావర్కర్లు హాజరుకారని స్పష్టం చేశారు.

తాగునీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పెద్ద ఆర్కుర్ గ్రామపంచాయతీ పరిధి పెద్దఆర్కూర్ గ్రామంలో పాయం వారి గుంపులో తాగునీటి బోరు ఏర్పాటుకు స్థానిక సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి సభ్యులు అమ్మాజీ శుక్రవారం భూమి పూజ చేశారు. గ్రామంలో తీవ్రమైన మంచినీటి ఎద్దటి నెలకొన్న నేపథ్యంలో సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా ఆమె తక్షణమే స్పందించి బోరుబావి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజ్ కుమార్, మాజీ ఎంపిటిసి పాయం సత్యనారాయణ, గ్రామ పెద్ద పాయం రాజయ్య, స్థానిక వార్డు మెంబర్ చిచ్చుడి రాజమ్మ, పూణెం సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

కారిడార్ పనులు పరిశీలించిన యువరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం చేపడుతున్న పనులను రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ యువరాజు పరిశీలించారు. శుక్రవారం ఆయన పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు. పరిశ్రమల స్థాపన కోసం మౌలిక వసతులు కల్పనలో భాగంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణాలు, ఇతర పనులను పరిశీలించారు. భూసేకరణ ప్రభావిత గ్రామాలకు సంబంధించి అనుసంధానం రోడ్లు, కారిడార్ రోడ్డు పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సబ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి బౌండరీస్ ఏరియాను పరిశీలించారు. మ్యాప్ ను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి సి అనిత, ఏపీఐఐసీ జనరల్ మేనేజర్ నరసింహారావు పాల్గొన్నారు.

మ్యాపును పరిశీలిస్తున్న యువరాజు

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకువేలి మండలంలోని బస్కి పంచాయితీ నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ గ్రామస్థులు జిల్లా కలెక్టర్కు శుక్రవారం పాడేరు స్పందన కార్యక్రమంలో పిర్యాదు చేశారు. 2023 నుండి 2025 డిసెంబర్ వరకు పంచాయితీ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ 66,43,121 నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. పనులు చేపట్టకపోయినా, చేసినట్లుగా చూపడం, క్లాప్ మిత్రుల జీతాలు చెల్లించక పోవడం, శానిటేషన్, విద్యుత్ సామాగ్రి కొనుగోళ్ల పేరుతో తప్పుడు తీర్మానాలు, రికార్డులు సృష్టించడం వంటి చర్యల ద్వారా సుమారు రూ. 31,48,869 నిధులు దుర్వినియోగం అయ్యాయని వారు పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం పై సమగ్ర విచారణ జరిపి బస్కి పంచాయితీ సర్పంచ్ పాడి రమేష్పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బురిడీ దశరథ్, సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, క్లాప్ మిత్రులు కొర్రా సుబ్బారావు, కిల్లో అర్జున్, సమర్ది దొంబు, కొర్రా దొన్ను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రామస్తులు, నాయకులు

సంతకాలు సేకరణ చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విఆర్.పురం

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన మండలంలోని రేఖపల్లి పంచాయతీలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షుడు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ సంతకాల కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, మండల నాయకులు కాపారపు ఉమామహేశ్వరరావు, చీమల కాంతారావు, ముత్యాల జయరాజు, సోడి చిరంజీవి, రేపు పోసి, రేఖపల్లి అంబేద్కర్ కాలనీ యూత్ సభ్యులు మాచర్ల రిషి, పెరుమల వేణు, మేడిపల్లి ముత్యాలరావు, పలివెల నాగేశ్వరరావు, మాచర్ల వెంగళరావు పాల్గొన్నారు.

రోడ్లపై వరి ధాన్యం ఆరబెడితే చర్యలు

ప్రజాశక్తి-గంగవరం

ప్రధాన రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టినా, కుప్పలు వేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. గంగవరం నుండి కొత్తపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబెట్టిన రైతులకు శుక్రవారం ఆయన కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనదారులకు ఇబ్బంది కలగడంతో రోడ్ ప్రమాదాలు జరిగి మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం వాహన తనిఖీ నిర్వహించి హెల్మెట్ ధరించని వారికి చలానాలు రాయడం జరిగింది. ఆయన వెంట సిబ్బంది సాయి, కొండబాబు ఉన్నారు.

తనిఖీలు చేస్తున్న ఎస్ఐ వెంకటేష్

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

• జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్
• జిల్లాలో 2,948 పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

పాడేరులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరంలో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి- పాడేరు: అల్లూరి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ స్టూడెంట్స్ సమావేశాలు ఉత్తేజ పూరింతంగా జరిగాయి. జిల్లాలో 2948 పాఠశాలల్లో ఈ సమావేశాలు జరిగాయి. శుక్రవారం లగేశపల్లి కేజీబీవీ స్కూల్లో జరిగిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్పర్సన్, మాజీ శాసనసభ్యులు, డీఈవోలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేవారే ఉపాధ్యాయులన్నారు. ఉపాధ్యాయుడు సరైన, సమర్థవంతమైన విద్యావంతుడు అయినప్పుడే విద్యార్థులకు సరైన సమర్థవంతమైన విద్యను అందించడం గలరన్నారు. ప్రణాళికతో విద్యను బోధించాలని తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, విద్యార్థులకు ఇరువురి ఆశీస్సులు లభించినప్పుడు ఉన్నత శిఖరాన్ని అధిరోహించడం ఖాయమని అన్నారు.

మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ,. పిల్లలకు చదువుతోపాటు అదనపు సమయాలలో నైపుణ్యత పై శిక్షణ ఇచ్చినప్పుడు సైన్స్ ఎగ్జిబిషన్ లాంటి ఏర్పాటు చేయగలుగుతారన్నారు. పేరెంట్ కమిటీ చైర్మన్ పాంగి అప్పారావు మాట్లాడుతూ ఇలాంటి పేరెంట్ మీటింగ్స్‌తో మంచి సంబంధాలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్వతి, మాజీ ఎంపీపీ బుర్ర విజయ రాణి, డీఈవోలు1 ఎంఈఓ జాన్, సరస్వతి పాల్గొన్నారు.

హుకుంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల1లో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు నియోజకవర్గం ఇంచార్జి, విజయనగరం జోనల్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర హాజరయ్యారు. సభకు ముందు విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలతో ప్రేక్షకులను, తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దొన్నుదొర మాట్లాడుతూ, పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులను పరిశీలించి, వారి విద్య ప్రగతిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమాజంలో విద్యార్థి దశ నుంచే మత్తు పదార్థాలకు అలవాటు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు శతక బొంజు బాబు, ఎంపీటీసీ కొమ్మరమ్మ, జనరల్ సెక్రెటరీ బొడ్డ శ్యామ్, వైస్ ప్రెసిడెంట్ ఎల్ నాగేశ్వరరావు మజ్జి, ఏఎంసి డైరెక్టర్ చిట్టిబాబు, మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం. అధికార ప్రతినిధి సాగర్ సత్యవతి పాల్గొన్నారు.

అరకులోయ: పిల్లల సామర్థ్యం, నైపుణ్యత, ఆరోగ్యం తెలుసుకోవడానికి మెగా పేరెంట్స్ మీటింగ్ వేదికగా నిలుస్తుందని పాడేరు ఐటిడిఏ పిఓ, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ అన్నారు. అరకులోయ మండలంలోని రవ్వలగుడా గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉమండలంలోని సిఏహెచ్ స్కూల్ లో హెచ్ఎం దయానిధి, కొత్తబల్లు గూడా బాలికల పాఠశాలలో కూడా హెచ్ఎం పద్మ, ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. అనంతరం రవ్వలగూడ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత చదువు చదివి న్యాయవాది గా పనిచేస్తున్న బుజ్జి బాబును ఆమె సన్మానించారు ఈ కార్యక్రమంలో అరకులోయ జడ్పిటిసి శెట్టి రోషిని, సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, ఎంఈఓ భారతిరత్నం, ఏ టి డబ్ల్యు ఓ వెంకటరమణ, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఏపీఎస్ వ్యవస్థాపకుడు మోహన్, వైసిపి నేత శెట్టి అశోక్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాపారావు, పిడి ప్రశాంత్, హెచ్ డబ్ల్యు ఓ రామ్మూర్తి పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని ప్రభుత్వ గవర్నమెంట్ హైస్కూల్, యుపి, ఎంపీపీ, జిపిఎస్, జూనియర్ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ డే ను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యురాలు సిహెచ్ జానకిమ్మ మాట్లాడుతూ,బాగా చదివి మంచి ఉద్యోగాలు పొంది తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ ఎస్ సుందర్‌రావు, ఎంఇఓ 2 జి గేన్ను, సర్పంచ్,సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు కే.హరి, కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు, సర్పంచ్ సిహెచ్ వెంకట్రావు, గసభ పంచాయతీ సర్పంచ్ పి.సునీత, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ బాబురావు పాల్గొని స్థానిక గురుకులం, ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పాల్గొన్నారు.విద్యార్థుల ప్రగతిపై నిరంతర దృష్టి అవసరం అన్నారు. ఇంజినీరింగ్ అధికారి మాణిక్యం కొత్తూరు ఆశ్రమ పాఠశాలలో పాల్గొన్నారు. జూనియర్ కళాశాల సమావేశంలో ఎంపీపీ అప్పలరాజు, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షణ్ముఖరావులు పాల్గొన్నారు.

కాశీపట్నం, అనంతగిరి: విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. అనంతగిరి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలు 1, 2 హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి అరుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. అనంతరం బాలికల పాఠశాల 2 సందర్శించారు. గర్ల్స్ 1 పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలం జెడ్పిటిసి గంగరాజు, ఎంపీపీ నీలవేణి, సర్పంచ్ రూతు, వైసిపి మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అప్పారావు,ఎగువశోభ సర్పంచ్ సింహాద్రి, ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, ఎంఈఓ బాలాజీ, గుజ్జల మధుసూదన్ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు :: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు1లోని ప్రధానోపాధ్యాయులు పి.మహేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి కె.కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. ఐసిడిస్ సిడిపివో విమలకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిహెచ్ వరహాలమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజన ఆశ్రమ బాలురు1 పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సాగిన రామరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జడ్పీటీసీ పోతురాజు మాట్లాడుతూ, సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు తల్లిదండ్రులు పిల్లల చదువు పురోగతిని అడిగి తెలుసుకోవడం ఎంతో అవసరం అని ఆయన సూచించారు. కూటమి నాయకులు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జి బాబు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, ఏఎంసీ డైరెక్టర్లు పెద్దిరెడ్డి బేతాళుడు, కిముడు కృష్ణమూర్తి, రీమల నవభరత్‌లు పాల్గొన్నారు.బాలురు 2, బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో సిడిపిఓ శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గౌరీ సౌజన్య పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులకు 100 రోజుల ప్ర ణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారులు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మా డేవిడ్, పుష్ప, గిరిదర్, చిట్టిబాబు, చిట్టమ్మ, సాగిన లక్ష్మి పాల్గొన్నారు

సీలేరు : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే గురువులతో పాటు తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సీలేరు ఎస్సై యాసీన్, స్థానిక హోమియో వైద్యాధికారి సృజన రాయ్ పేర్కొన్నారు. జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్, ఏపీ గురుకుల పాఠశాల బాలికల, ఆశ్రమ పాఠశాల, దారకొండ, సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలు, స్థానిక డిఏవి పాఠశాలతో పాటు సీలేరు, దారకొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీ, యూపిపి పాఠశాలల్లోనూ శుక్రవారం మెగా పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొచ్చారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు జాతీయ జెండాను రెపరెపలాడిస్తూ పలు విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.శంకరరావు, బుచ్చిబాబు, హెచ్ఎంలు నాగ శకుంతల, నాగభూషణం, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి సర్పంచ్ దుర్గో, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : విద్యార్థులు తమకు విద్యను బోధించే ఉపాధ్యాయులను గౌరవించినప్పుడే మంచి విద్యార్థులుగా గుర్తింపు వస్తుందని తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, సీఐ గౌరీ శంకర్, ఎస్సైలు శివకుమార్, చినబాబు, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎంఈఓ కేవీవీ సత్యనారాయణదొర, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ జి.పెద్దిరాజు అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు, నృత్యాలు, పాటలు, ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు ప్రాజెక్టు వర్కులను ప్రదర్శించగా, వాటిని తల్లిదండ్రులు ఆసక్తికరంగా తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, హెచ్ఎంలు విజయలక్ష్మి, సత్యవేణి, రమేష్ బాబు, సుబ్రహ్మణ్యేశ్వరి, నాగ సుశీల, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగవరం : కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గంగవరం మండలం కొత్తాడ కెజిబివిలో యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ కె.సూర్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన తలిదండ్రుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావు, ఎంఇఒ టి.మల్లేశ్వరరావు, ఎంపీడీఓ లక్ష్మణరావు, పాము అర్జున్, పల్లాల వెంకటరెడ్డి, పండా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, మాజీ జిసిసి చైర్మన్ ఎంవివి.ప్రసాద్, ఎంఈఓ రాంబాబు, ఎంపీడీవో డి.ప్రసాదు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

హుకుంపేటలో మాట్లాడుతున్న దొన్నుదొర

చింతపల్లిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

కొయ్యూరులో విభిన్న వేషధారణలో విద్యార్థులు

సీలేరులో విద్యార్థుల ప్రదర్శనలు

రాజవొమ్మంగిలో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న నేతలు, అధికారులు

విశాఖలో క్రికెట్ ఫీవర్

- ◆ నేడు సఫారీలతో భారత్ చివరి వన్డే
- ◆ సీరీస్ నిర్ణయాత్మక పోరుకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ ఉత్కంఠభరితమైన క్లైమాక్స్‌కు చేరుకుంది. ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలిచి సిరీస్‌లో సమంగా నిలబడ్డాయి. సిరీస్ విజేతను నిర్ణయించే చివరి వన్డేకు ఎసిఎ- విడిసిఎ స్టేడియం వేదిక కానుంది. శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు ఈ నిర్ణయాత్మక పోరు ప్రారంభం కానుంది.

ఇరు జట్ల ప్రాక్టీస్

భారత్, దక్షిణాఫ్రికా జట్లు రెండూ ఇప్పటికే విశాఖపట్నం చేరుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఇరు జట్లు ఎసిఎ- విడిసిఎ స్టేడియంలో ఉత్సాహంగా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్నాయి. ముఖ్యంగా సిరీస్ విజేతను నిర్ణయించే మ్యాచ్ కావడంతో, ఇరు జట్ల ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు.

విజయంపై ధీమా వ్యక్తం చేసిన ఇరు జట్లు

మ్యాచ్‌కు ముందు జరిగిన మీడియా సమావేశాల్లో ఇరు జట్ల సారథులు కీలక విషయాలు పంచుకున్నారు. భారత కెప్టెన్ ఈ సిరీస్‌ను గెలవడంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "సిరీస్‌లో చివరి మ్యాచ్ ఎప్పుడూ ముఖ్యమైందే. మా జట్టులోని యువ ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి బాగా ఆడారు. దక్షిణాఫ్రికా బలమైన జట్టు, విశాఖ అభిమానుల మద్దతుతో సిరీస్‌ను కైవసం చేసుకుంటాం' అనే నమ్మకం ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు.

దక్షిణాఫ్రికా కెప్టెన్ మాట్లాడుతూ, తమ జట్టు రెండో వన్డేలో గెలిచిన ఆత్మవిశ్వాసాన్ని ఈ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తామని తెలిపారు. ఇది సిరీస్ డిసైడర్ మ్యాచ్. అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించాలని అనుకుంటున్నాం.

వర్షం ముప్పు

శనివారం మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో విశాఖ నగరంలో వాతావరణంపై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మ్యాచ్ రోజున సాయంత్రం సమయంలో వర్షం పడే అవకాశం కొంతవరకు ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ ముప్పు ఎక్కువగా ఉండకపోవచ్చని, మ్యాచ్ సాఫీగా జరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వర్షం అంతరాయం కలిగించినా, త్వరగా అవుట్‌ఫీల్డ్‌ను సిద్ధం చేయడానికి ఎసిఎ అన్ని చర్యలు తీసుకుంటోంది.

టికెట్లు హాట్ కేకుల్లా విక్రయం

భారత్-దక్షిణాఫ్రికా మధ్య సిరీస్ డిసైడర్ అయిన మూడో వన్డే విశాఖపట్నంలో క్రికెట్ ఉత్సాహాన్ని పతాక స్థాయికి చేర్చింది. టీమ్ ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మొదటి రెండు వన్డేల్లోనూ (రాంచీ, రాయ్‌పూర్‌లలో) వరుసగా సెంచరీలు చేయడంతో, విశాఖ మ్యాచ్‌కు డిమాండ్ అమాంతం పెరిగింది. కోహ్లీ ఫామ్, అలాగే విశాఖలో ఆయనకు ఉన్న అద్భుతమైన రికార్డు (సగటు 97.83) కారణంగా, అభిమానులు అతడి బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా చూడాలని ఉవ్విళ్లూరుతున్నారు. కోహ్లీ సెంచరీ తర్వాత, టికెట్ల రెండు, మూడు విడతల్లో నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా అమ్ముడయ్యాయి. ఎసిఎ అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడంతో, స్టేడియం సామర్థ్యం మేరకు టికెట్లన్నీ (రూ.1,200 నుండి రూ. 18,000 వరకు వివిధ ధరల్లో) పూర్తిగా అమ్ముడయ్యాయి.

ఏర్పాట్లను పరిశీలించిన ఎసిఎ అధ్యక్ష, కార్యదర్శులు

ఎసిఎ -విడిసిఎ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ), పోలీస్ యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను ఎసిఎ అధ్యక్షులు, ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. విఐపి, వివిఐపి గ్యాలరీలు, ప్రముఖుల రాకపోకలు, వారి భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

కట్టుదిట్టమైన పోలీసు భద్రత

విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మ్యాచ్ రోజున దాదాపు 1,500 మందికిపైగా పోలీసు సిబ్బందిని స్టేడియం పరిసరాలలో మోహరించనున్నారు. స్టేడియం లోపల, ప్రవేశ ద్వారాల వద్ద, పార్కింగ్ ప్రదేశాలలో బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా స్టేడియం మొత్తం నిఘా ఉంచనున్నారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై దృష్టి పెట్టడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రేక్షకులు మొబైల్ ఫోన్లు, పర్సులు మినహా ఇతర వస్తువులు (వాటర్ బాటిల్స్, బ్యాగులు, ఆహార పదార్థాలు) తీసుకురాకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు.

విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై చర్చ!

- 10 జిల్లాల్లో 21,880 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరణ
- 2032 నాటికి 120 బిలియన్లు, 2047 నాటికి 1.0 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నేల విడిచి సాము' చెయ్యడం అంటే ఇదేనేమో. దీర్ఘకాలిక ప్రణాళికలు నిర్ణయించుకోవడాన్ని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే అందుకు అవకాశాలతో పాటు ప్రభుత్వాలు తీసుకునే ఆర్థిక, పారిశ్రామిక విధానం అత్యంత కీలకమైనదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. మరో రకంగా చూస్తే ఏ పార్టీ ప్రభుత్వానికైనా ప్రజలు అధికారం ఇచ్చేది 5ఏళ్లకే. కానీ 2047 వరకూ కూటమి ప్రభుత్వం ఆరాటం ఇక్కడ కనిపిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సహా కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు చెబుతున్న ప్రకారం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, మన్యం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలతో కలిపి మొత్తం 21,880 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఎకనమిక్ రీజియన్ ప్రాజెక్టుకు ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యనిర్వహక అధికారి డాక్టర్ ఎన్.యువరాజ్ (ఐఎఎస్) సారథ్యంలో శుక్రవారం విఎంఆర్‌డిఎలో జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సహా, విఎంఆర్‌డిఎ, జివిఎంసి కమిషనర్లు, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఈ రీజియన్‌పై కీలక చర్చ చేశారు. ప్రభుత్వం చెబుతున్న క్రారం 2032 నాటికి ఈ ప్రాంతం 120 బిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 1.0 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ద్వారా ఎపి 2.40 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు.

విశాఖ రీజియన్‌ను 'గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్'గా మార్చడమే లక్ష్యం...

పోర్టుల ద్వారా వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, ఐటి హబ్స్, ఇన్నోవేషన్ సెంటర్ల అభివృద్ధి, వ్యవసాయం, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, పెద్ద ఎత్తున పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, రహదారుల నిర్మాణం, రైల్వే పోర్టుల కనెక్టివిటీ వంటి అంశాలు దీంట్లో ఉన్నాయి. ఏకంగా ఈ ప్రాంతాన్ని 'గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్'గా అభివృద్ధి చేసెయ్యాలంటూ ప్రభుత్వం కళలు కంటోంది. సుమారు 100 నుంచి 150 బిలియన్ పెట్టుబడులను ఆకర్షించడం దీంట్లో ఒక ప్రధాన లక్ష్యంగా ఉంది. తద్వారా 20లక్షల ఉద్యోగాలు యువతకు ఇస్తారని చర్చల ద్వారా వెల్లడవుతోంది.

వాస్తవానికి విశాఖపట్నం ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా పోర్టులు, భారీ పరిశ్రమలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్‌లు), సేవారంగం, మత్స్యసంపద ఎగుమతులపై ఆధారపడి ఉంది.

వాస్తవాలతో నిమిత్తంలేకుండా చర్చ..

బిలియన్, ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఏ ప్రాంతాలైనా రూపుదిద్దుకోవాలంటే ఆ ప్రాంత భౌగోళిక, ఆర్థిక, పారిశ్రామిక స్థితిగతుల అధ్యయనం అత్యంత ముఖ్యమైనది. విశాఖ ముఖద్వారంగా అభివృద్ధి కావాల్సిన 10 జిల్లాల ఎకనమిక్ రీజియన్‌లో ప్రస్తుత భౌతిక పరిస్థితులను పాలకులు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డ్ వంటివి ఆర్థికంగా, వర్కర్ల పరంగా బలహీనపడుతూనే ఉన్నాయి. పాలకుల ప్రైవేటీకరణ, కార్పొరేట్లకు కట్టబెట్టే విధానంతో నష్టపోతూ ఆర్థిక రంగం, సేవారంగాన్ని కుదేలు చేస్తున్న సంగతి కాదనలేని సత్యం. తాజాగా మునుపెన్నడూలేని రీతిలో రూపాయి విలువ భారీ పతనం అవుతోంది. 2014లో డాలర్‌తో పోల్చినప్పుడు మన రూపాయి విలువ రూ.62లు ఉండగా నేడు రూ.90కు చేరింది. అంటే రూ.90 ఇస్తే గానీ మనం ఒక డాలర్‌తో సరితూగలేమన్నమాట. మన దేశం విదేశాల నుంచీ దిగుమతులపై ముఖ్యంగా ముడిచమురును డాలర్‌లలోనే తెచ్చుకోవాలి. దీంతో భారీ స్థాయిలో రూ.లక్షల కోట్లు వెచ్చించాల్సిన గత్యంతరం ఏర్పడబోతుంది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోనుంది. కొత్త ఉద్యోగాలు రానేరావు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ భారాలన్నీ ప్రజలపైనే పడతాయి. డాలర్ విలువ తగ్గుతుందన్న గ్యారెంటీయే లేదు. అలాంటప్పుడు బిలియన్, ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధ్యమా? వ్యవసాయ రంగం దెబ్బతిని ఉపాధికి గ్యారెంటీ ఇక్కడ లేదు. ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే స్థిరమైన పునాది ప్రభుత్వ రంగాన్ని నిలబెట్టే విధానం తీసుకొని కార్పొరేట్లకు ఊడిగం చేసే పాలకుల తీరు మారకపోతే విశాఖ ఎకనమిక్ రీజియన్ లక్ష్యాలు నెరవేరతాయనుకోవడం అత్యాశే అవుతుంది. నేలవిడిచి సాముచేయడం కాగలదనడంలో ఎలాంటి సందేహం లేదు.

నేరాలు ఘోరాలు

ఘాట్ రోడ్‌లో బైక్ బోల్తా
ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చింతపల్లి: అల్లూరి జిల్లాలో బోడకొండమ్మ ఘాటి రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మార్గంలో శుక్రవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. జి.మాడుగుల మండలంలోని వేమరాజు కోడపల్లి (చవదివీధి) గ్రామానికి చెందిన యువకుడు కిముడు దావీదు రాజు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం దావీదు రాజు తన భార్య బోనంగి వెంకటలక్ష్మి (వాణి) స్వగ్రామం డౌనూరు నుండి చింతపల్లి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. బోడకొండమ్మ ఆలయం రావి మామ పాకాల మధ్య మలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది దీంతో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. అదే సమయంలో నర్సీపట్నం వెళ్తున్న చింతపల్లి ఎస్సై వి.వెంకటేశ్వరరావు ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. క్షతగాత్రుడిని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్స్ ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

క్రికెట్ బ్లాక్ టికెట్ల దందా
15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య విశాఖ స్టేడియం వేదికగా శనివారం మధ్యాహ్నం 1.00 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించి టికెట్ల బ్లాక్ దందా మొదలైంది. తమ అభిమాన క్రికెటర్స్, జట్టును చూసేందుకు ఫ్యాన్స్ ఎంతయినా ఖర్చు పెట్టడానికి వెనుకాడకపోవడాన్ని అదునుగా భావిస్తున్న కొందరు మ్యాచ్ టికెట్లను బ్లాక్‌లో అమ్ముతూ అందినకాడికి దోచుకుంటున్నారు. స్టేడియం వెలుపల బ్లాక్‌లో టికెట్లు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. బ్లాక్ టికెట్లు అమ్మే 10 మందిని, కొనేవారు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కాంప్లిమెంటరీ టికెట్లు, తొమ్మిది ఆన్‌లైన్ టికెట్లు స్వాధీనం చేసుకొని పిఎం.పాలెం పోలీసులకు అప్పగించారు. వీరు రూ.1200 టికెట్ రూ.3000 వేలకు, రూ.3000 టికెట్‌ను రూ.5,500కు విక్రయిస్తున్నారు.

18న తపాలా అదాలత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలో ఈ నెల 18వ తేదీన 120వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి.సాగర్ తెలిపారు. రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు ఉదయం 11 గంటలకు, సమస్యలు పరిష్కరించు నిమిత్తం ఈనెల 15వ తేదీన ఎంవిపి బస్సు కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో నిర్వహించే తపాలా అదాలత్‌లో సమర్పించాలని కోరారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్ ద్వారా చర్చించబడతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

విశాఖ వేదికగా 63వ జాతీయ రోలర్ స్కేటింగ్

- 11 విభాగాలుగా పోటీల నిర్వహణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రతిష్టాత్మకమైన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు విశాఖ వేదికగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలకు విశాఖ నగరం ఆతిథ్యం ఇస్తున్నట్లు ఏపి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జె.సుధాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం బీచ్‌రోడ్డులోని వీఎంఆర్‌డిఎ పార్క్‌లో స్కేటింగ్ రింక్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ వరకు 10 రోజులు నిర్వహించే తపోటీలలో 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. 11 విభాగాలలో జరిగే పోటీలకు 4000 మంది స్కేటర్లు పాల్గొంటారని తెలిపారు. ఏపి రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ థామస్ చౌదరి మాట్లాడుతూ, విశాఖ నగరంలో మూడు ప్రాంతాలలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉడాపార్క్, శివాజీ పార్క్, కైలాసగిరి, బోయపాలెం స్కేటింగ్ రింక్‌లలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరీ డాక్టర్ డి.భగీరథ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు యార్లగడ్డ రవి, శీలం లక్ష్మణ్ తదితరులు ప్రసంగించారు.